## 'పూరి'లో బతుకమ్మ వేడుకలు


పూరి జగన్నాథ్ ఆలయం ఆవరణలో బతుకమ్మతో తెలంగాణ మహిళలు

వేములవాడ, అక్టోబర్ 19: ఒడిస్సా రాష్ట్రంలోని పూరి జగన్నాథ ఆలయంలో తెలంగాణ మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వేములవాడ బ్రాహ్మణ అనువంశిక కుటుంబాలు ఒడిస్సా రాష్ట్రంలో ఆలయాల సందర్శనకు వెళ్లారు. కగా గురువారం పూరి జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలో బతుకమ్మను పేర్చి ఆడారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వేములవాడ బ్రాహ్మణ అనువంశిక కుటుంబాలు ఉపాధ్యాయుల రమాదేవి సాంబశివుడు, కరుణశ్రీ చంద్రశేఖర్, పద్మ చంద్రమోహన్, గర్శకుర్తి అపర్ణ పూర్ణచందర్ ఉన్నారు.

## పల్లె దవాఖానను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రుద్రవరంలోని పల్లె దవాఖానను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

వేములవాడ రూరల్, అక్టోబర్ 19: మండలంలోని రుద్రవరం గ్రామంలోని పల్లె దవాఖానను జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లె దవాఖానలో వైద్య సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడంతో సిబ్బందిపై సుమన్‌మోహన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పల్లె దవాఖానలో తప్పనిసరిగా వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. రోగులు వస్తే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. అందుబాటులో లేని వారికి వెంటనే మెమోను అందజేశారు.

బోయినపల్లి, అక్టోబర్ 19: బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. గురువారం బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో నిత్యం విధుల్లో ఉండి రోగులకు ప్రజలకు వైద్య సేవలందించాలని కోరారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు అయ్యేందుకు చూడాలని కోరారు.

## రొమ్ము క్యాన్సర్ నివారణపై అవగాహన

వేములవాడ/వేములవాడ రూరల్, అక్టోబర్ 19: వేములవాడలోని మార్కండేయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కే జ్యోతి గురువారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుతం చాలా మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై ఎలాంటి అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాలకు ప్రమాదంగా మారిందన్నారు. ముందస్తు వైద్యుల సలహాలతో శస్త్ర చికిత్సల ద్వారా నయం కావడమే కాకుండా ప్రాణాలకు ముప్పు తప్పుతుందని ఆమె చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే అందుబాటులోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. వేములవాడ రూరల్ మండలం మల్లారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రొమ్ము క్యాన్సర్‌పై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల, టీచర్ ఉమ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం రొమ్ము క్యాన్సర్ వల్ల మహిళలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.


మల్లారంలో క్యాన్సర్ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల


బాలరాజుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ బండ మల్లేశం, నాయకులు


వేములవాడ 10వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి రామ్‌చందర్‌కు బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న మహిళా ఓటర్


వేములవాడ 18 వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న కౌన్సిలర్లు కొండ పావని, కొండ శ్రీలత

# అభివృద్ధి, సంక్షేమాన్ని గెలిపించుకుందాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి
- వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతుగా ప్రచారం
- నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు


రుద్రంగిలో చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, అక్టోబర్ 19: అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని 3వ సారి గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. గురువారం వేములవాడ పురపాలక సంఘం పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. పదో వార్డులో కౌన్సిలర్ సిరిగిరి రామ్ చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారానికి ఆమె హాజరై ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి సీఎం చేయడానికి ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి అభివృద్ధి ప్రదాతగా నిలిచిన కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా వస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. 16వ వార్డులో వార్డు కౌన్సిలర్ కొండా శ్రీలత, 18 వ వార్డులో కొండా పావని కూడా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సిరిగిరి రామ్ చందర్, కొండ శ్రీలత, కొండ పావని, మారం కుమార్, ఇప్పపూల అజయ్, కో ఆప్షన్ సభ్యుడు బాబున్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పుల్కం రాజు, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు అక్రమ పాషా, నాయకులు రామతీర్థపు రాజు, గూడూరి మధు, కొండ కనకయ్య, కొండ నర్సయ్య, గన్నమనేని రామారావు, దేవరాజు, జంగేటి సంజీవ్, తదితరులు ఉన్నారు.

### అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి

రుద్రంగి, అక్టోబర్ 19: బంగారు తెలంగాణ కోసం అహర్నిషలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రుద్రంగి మండల కేంద్రంలోని 3వ వార్డులో నాయకులతో కలిసి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ కంటె రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జమీల బేగం, నాయకులు చెప్యాల గణేశ్, ఆకుల భూమక్క, దయ్యాల నారాయణ, కాదాసు లక్ష్మణ్, గడ్డం మహేందర్, వెంకటి పాల్గొన్నారు.

### చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలి

వేములవాడ రూరల్, అక్టోబర్ 19: వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి, వెంకటాంపల్లిలో ఇంటింటా ప్రచారాన్ని ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఏశ తిరుపతి, చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బండ మల్లేశం మాట్లాడారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మోజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాయన్నారు. మరోసారి వేములవాడ గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. అనంతరం ఇంటింటా డప్పుచప్పుల మధ్య ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, నర్సయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



### కారు గుర్తుకే ఓటేస్తా..

వేములవాడ పట్టణంలో 10వ వార్డులో చైర్ పర్సన్ మాధవి, కౌన్సిలర్ సిరిగిరి రామ్ చందర్, నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఓ వృద్ధున్ని ఓటు వేయాలని కోరారు. దీంతో ఆ వృద్ధుడు కారు గుర్తుకే ఓటు వేస్తానని ఆనందం వ్యక్తం చేస్తూ నినదించాడు.

# ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

బోయినపల్లి, అక్టోబర్ 19: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్-సిరిసిల్ల వైపు వెళ్తున్న ప్రతి వాహనాన్ని క్షణ్ణంగా తనిఖీ చేయాలని చొప్పదండి రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయి చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. గురువారం బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద ఉన్న చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేయాలని చెప్పారు. వీఐపీల వాహనాలను కూడా ఆపి తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల విధులను ఎవరూ కూడా నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. ఈ తనిఖీలో డబ్బు, బంగారం, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు దొరికితే ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత, ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.



కొదురుపాక వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయి

## గుడుంబా తయారు చేస్తే చర్యలు


బెల్లం పానకం, ఇప్పపువ్వును పరిశీలిస్తున్న ఎస్ఐ

కోనరావుపేట, అక్టోబర్ 19: గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. ఊరు తండాలో గుడుంబా తయారు చేస్తున్న భూక్య లతను పట్టుకున్నారు. 250 గ్రాముల స్ఫటిక, రెండు లీటర్ల నాటుసారా, 60 లీటర్ల బెల్లం పానకంతో పాటు 25కిలోల బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.